నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, శుక్రవారం 2 మే 2025 | JANAGAON

రైతుల ధాన్యం.. అమ్ముకోలేని దైన్యం

నెల్లికుదురు కొనుగోలు కేంద్రంలో కాంటాలు కాకపోవడంతో ధాన్యాన్ని కుప్పలుగా పోసి పట్టాలు కప్పుకున్న రైతులు

నర్సంపేట : తడిసిన మక్కలను దగ్గరకు నెడుతున్న రైతులు

దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ఇబ్బందులు తప్పడం లేదు. సాగు నుంచి పంట అమ్ముకునేంత వరకు కష్టాలు తీరడం లేదు. యాసంగిలో అష్టకష్టాలు పడి పండించిన ధాన్యం విక్రయించేందుకు నానా తంటాలు పడుతున్నారు. సర్కారు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా మారాయి. అరకొర తప్ప మిగతా అన్ని కేంద్రాల్లోనూ కాంటాలు మొదలే కాకపోవడంతో రోజుల తరబడి అక్కడే పడిగాపులు పడాల్సి వస్తున్నది. వసతులు కల్పించక, గన్నీ సంచులు లేక, కొనుగోళ్లు జరగక ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలతో ఆరబెట్టిన వడ్లు తడిసి రైతులు మరింత నష్టపోతున్నారు. దీనికి తోడు అధికారుల కొత్త నిబంధనలు వడ్లు అమ్ముకోలేని పరిస్థితిని కల్పిస్తున్నాయి. దీంతో మిల్లరు ఆశ్రయిస్తే తేమ, తాలు పేరుతో అగ్గువకు కొంటూ అన్నదాతకు అన్యాయం చేస్తున్నారు.

- వరంగల్ ప్రతినిధి/మహబూబాబాద్ (నమస్తే తెలంగాణ), మే 1

వసతులు కరువు.. చెట్ల నీడే దిక్కు

టెంట్లు వేయకపోవడంతో చెట్టు నీడ కింద కూర్చున్న రైతులు

మహబూబాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నీడ కోసం టెంట్లు వేయకపోవడంతో వారికి చెట్ల నీడే దిక్కవుతున్నది. తాగునీటి వసతి కూడా లేకపోవడంతో రైతులు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. టార్పాలిన్లు, గన్నీ సంచులు అందుబాటులో లేవు. తరుగు పేరుతో బస్తాకు నాలుగు కిలోల ధాన్యం తీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. 15 రోజులు దాటినా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో కేంద్రాల్లోనే ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడుస్తున్నదని, ఇప్పటికైనా కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 174 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ప్రభుత్వం రైతులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. జిల్లాలోని తాళ్లపూసపల్లి, ఈదులపూసపల్లి, నెల్లికుదురు తదితర కొనుగోలు కేంద్రాల్లో రైతుల పరిస్థితి మరీ దైన్యంగా ఉంది.

ధాన్యం కొనుగోలుకు నిబంధనాలు

ఖిలావరంగల్ : ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు కొర్రీలు పెడుతూ రైతులను గోస పెడుతున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నదాతలను నిబంధనల పేరుతో ఆగం చేస్తున్నది. ఖిలావరంగల్ మండలంలో బొల్లికుంట, వసంతాపురం, తిమ్మాపురం గ్రామాల్లో ఏటా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. అయితే ఈ సారి వసంతాపురంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇక తిమ్మాపురంలో ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క బస్తా కూడా తరలించలేదు. బొల్లికుంటలో మాత్రం అధికారికంగా ఒకటి, అనధికారికంగా మరొక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో అనధికారిక కేంద్రంలోనే క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో కొత్త నిబంధనలు రైతులకు ఇబ్బందిగా మారాయి. ఒక రైతు గరిష్ఠంగా ఎకరానికి 32 క్వింటాళ్ల చొప్పున తీసుకురావాలని, అదికూడా రూ.3 లక్షల కంటే ఎక్కువ విలువ చేసే ధాన్యం తేవొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పది, ఇరవై ఎకరాల్లో సాగు చేసిన రైతులు తలలు పట్టుకుంటున్నారు. గన్నీ బ్యాగ్‌ల పంపిణీ, టోకెన్ ఇవ్వడం, ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో అధికారులు ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో పంటలు నమోదు చేశారు. దీంతో ఆన్‌లైన్‌లో నమోదైన పంటకు, కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యానికి పొంతన లేకపోవడంతో తమ తప్పును కప్పి పుచ్చుకునేందుకు అధికారులు రైతులను గోసపెడుతున్నారు. అలాగే ధాన్యాన్ని దగ్గరలోని మిల్లులకు కాకుండా దూర ప్రాంతాలకు తరలిస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు బొల్లికుంట కొనుగోలు కేంద్రం నుంచి 2500 క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లులకు తరలించి 20 రోజులు దాటినా తమ ఖాతాలో డబ్బులు జమ కాలేదని రైతులు తెలిపారు.

బొల్లికుంటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం

గన్నీ సంచుల కొరత

వడ్ల కొనుగోలులో కీలకమైన గన్నీ సంచులు ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలకు చేరలేదు. వారం క్రితం అన్ని గ్రామాల్లోనూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గన్నీ సంచులు లేకపోవడంతో కాంటాలు మొదలు కావడం లేదు. రైతులు వెళ్లి సంచులు కావాలని అడిగితే వరుస ప్రకారం ఇస్తామని, కోటా ప్రకారం వస్తాయని నిర్వాహకులు చెబుతున్నారు. వ్యవసాయ అధికారులకు ఇంకా టోకెన్ బుక్కులు అందలేదు. కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటి నుంచి కాంటాలు అవుతాయో స్పష్టత లేకపోవడంతో రైతులు కల్లాల వద్దనే తక్కువ ధరకు మిల్లర్లకు నేరుగా అమ్ముకుంటున్నారు.

- అన్ని చోట్లా ఇంకా మొదలు కాని కాంటాలు
- అగ్గువకు మిల్లర్లకు అమ్ముకుంటున్న అన్నదాతలు
- తేమ, తాలు పేరుతో కోత పెడుతున్న వైనం
- కేంద్రాల్లో కొరవడిన వసతులు.. చెట్లే దిక్కు
- రైతులకు తలనొప్పిగా కొత్త నిబంధనలు
- రూ. 3 లక్షలపైన విలువ చేసే ధాన్యం తేవొద్దంటూ ఆదేశాలు
- సాగు నుంచి విక్రయం వరకు అన్నదాతకు అన్యాయమే..

నామమాత్రంగా సర్కారు కొనుగోలు కేంద్రాలు

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు మరోసారి అన్యాయం చేస్తున్నది. వడ్ల కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. యాసంగి వరి కోతలు మొదలై రెండు వారాలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో వడ్ల కొనుగోళ్లు జరగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లో సమస్యలే దీనికి కారణమవుతున్నాయి. సర్కారు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు మొదలు కాకపోవడంతో రైతులు అనివార్యంగా రైస్ మిల్లర్లపై ఆధారపడుతుండడంతో ఇదే అదనుగా తేమ పేరుతో కాంటాల్లో కోత పెట్టడంతో పాటు తాలుందని తక్కువ ధర నిర్ణయిస్తున్నారు. ప్రతికూల వాతావరణంతో అకాల వర్షాలు పడుతుండడం, కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో అరబోసిన ధాన్యం తడుస్తుండడం, కాంటాలు కాకపోవడంతో అన్నదాతకు రైస్ మిల్లర్లే దిక్కవుతున్నారు. అష్టకష్టాలు పడి యాసంగిలో సన్న వడ్లు పండించిన రైతులకు ఇప్పుడు ధరల కష్టాలు తప్పడంలేదు. రైస్ మిల్లర్లు బస్తాకు 42 కిలోలే తూకం వేయడం, తేమ పేరుతో అదనంగా మరో కిలో కోత పెడుతుండడంతో రైతులు క్వింటాకు సగటున రూ. 200 వరకు నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఏ గ్రేడ్ వడ్ల ధర క్వింటాకు రూ. 2,320, సాధారణ రకానికి రూ. 2,300గా ఉంది. వరి కోతలు మొదలై రెండు వారాలు గడుస్తున్నా అధిక శాతం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు మొదలు కాకపోవడంతో వడ్లు తీసుకొచ్చేందుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి వసతులు లేకపోవడం, టార్పాలిన్ల కొరతతో వర్షం వస్తే ధాన్యం తడిసిపోయే పరిస్థితి ఉంది. దీంతో చేతికి వచ్చిన పంట నష్టపోవాల్సి వస్తుందనే ఆందోళనతో రైతులు రైస్ మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు.

20 రోజులైనా డబ్బులు పడలే..

ఏటా మూడెకరాల్లో రెండు పంటలు వరి పంట సాగుచేస్తున్న. ఈ సారి 74 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన. అధికారులు ఆన్‌లైన్‌లో 1.8 ఎకరాల్లో పంట వేసినట్లు నమోదు చేసిండ్లు. వడ్లను మిల్లుకు పంపి 20 రోజులైనా బ్యాంక్ ఖాతాలో డబ్బులు పడలేదు. మూడు రోజుల నుంచి అధికారులకు ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయడం లేదు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

– మెట్టు రాజిరెడ్డి, బొల్లికుంట

నాలుగెకరాలే నమోదు చేసిండ్రు..

ఏడు ఎకరాల్లో వరి పంట వేసిన. వంద క్వింటాళ్లు దొడ్డు వడ్లు, 60 క్వింటాళ్లు సన్న వడ్లు పండినయి. అయితే అధికారులు నేను నాలుగు ఎకరాల్లో వరి వేసినట్లు నమోదు చేసిండ్రు. మూడెకరాల కంటే ఎక్కువ పంట తీసుకు రావద్దు.. రూ. 3 లక్షలపైన విలువ చేసే ధాన్యం తేవొద్దంటూ కండీషన్లు పెడుతున్నరు. ఆఫీసుల కూర్చొని ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేసి రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు.

– చక్రపాణి, బొల్లికుంట

ములుగులో వర్షానికి తడిసిన ధాన్యం

భూపాలపల్లి రూరల్: నేరేడుపల్లిలో నేలవాలిన పొలం వద్ద దిగాలుగా కూర్చున్న రైతు

గాలివానతో ఆగమాగం

రేగొండ : భాగిర్థిపేటలో ధ్వంసమైన అరటి తోట

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం రాత్రి, గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. వరి నేలమట్టం కాగా, మామిడి కాయలు రాలిపోయాయి. ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. చెట్లు కూలగా, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు చోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మక్కలు తడిసి ముద్దయ్యాయి. వాటిని ఆరబెట్టుకునేందుకు రైతులు శ్రమించాల్సి వచ్చింది. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంది. గణపురం మండలంలో పలు ఇల్లు ధ్వంసమయ్యాయి. భారీ వృక్షాలు కూలి రోడ్లపై పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భూపాలపల్లిలో ఇండ్ల కప్పులు ఎగిరిపోయాయి. రేగొండ మండలంలో అరటి, మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాటారంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ములుగులో చెట్లు, ఎన్‌హెచ్ వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గోవిందరావుపేట, తాడ్వాయి, వెంకటాపూర్ మండలంలో చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది. వరంగల్ జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మక్కలు కొట్టుకుపోయాయి.

- నమస్తే నెట్‌వర్క్, మే 1

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కుప్పకూలిన హోటల్ పైకప్పు

- నేలమట్టమైన వరి.. రాలిన మామిడి
- లేచిపోయిన ఇండ్ల పైకప్పులు
- కూలిన చెట్లు, విరిగి పడిన విద్యుత్ స్తంభాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం, మక్కలు

గణపురంలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు

పోచంపల్లిలో పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

కార్యకర్తలకు అండగా ఉంటాం..

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పార్టీ సభ్యత్వ బీమా చెక్కు అందజేత

పెద్దవంగర, మే 1: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని, ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పిండి యాకయ్య ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి గురువారం పార్టీ ఇన్సూరెన్స్ బీమా రూ.2లక్షల చెక్కును స్థానిక నాయకులతో కలిసి అందజేసి మాట్లాడారు. కార్యకర్తలు ఇబ్బందిపడకూడదనే ముందుచూపుతో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే మొట్టమొదటిసారిగా కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడంలో భాగంగా బీమాను కల్పించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే నాయిని అనుచరుడిపై కేసు నమోదు

నయీంనగర్, మే 1 : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అనుచరుడు కోనశ్రీకర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. 'నిరుపేద ఇల్లు కూల్చివేత, ఎమ్మెల్యే అనుచరుడి దౌర్జన్యం, జేసీబీతో ఇల్లు ధ్వంసం, ఆ భూమి మీది కాదంట కదా.. అని గతంలో నాయిని ఫోన్.. అంతేకాకుండా నెల రోజుల నుంచి సుబేదారి పోలీసు స్టేషన్‌చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి విచారణ చేస్తలేరు'.. అంటూ గత నెల 29న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. బాధితురాలు చింతల స్వరూప ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే అనుచరుడు కోన శ్రీకర్‌తో పాటు పలువురిపై కేసులు నమోదు చేశామని, దర్యాప్తు పూర్తయిన తర్వాత వారికి శిక్షను విధించనున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ. 73 లక్షల విలువైన గంజాయి పట్టివేత

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సైదులు

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- రెండు కార్లు స్వాధీనం

సుబేదారి, మే 1 : అనుమానం రాకుండా కార్లలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను వరంగల్ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు రూ.73 లక్షల విలువ చేసే 147.3 కిలోల గంజాయితో పాటు రెండు కార్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గురువారం వరంగల్ ములుగురోడ్డులోని యాంటీ నార్కొటిక్స్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సైదులు వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లికి చెందిన నేరెళ్ల సదయ్య అలియాస్ సతీశ్, హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన పామల శేషు ఆంధ్రప్రదేశ్‌లోని సుకుమామిడిలో గంజాయి కొనుగోలు చేసి ఇన్నోవా కారులో 40, స్విఫ్ట్‌లో 29 ప్యాకెట్ల చొప్పున నిజామాబాద్‌లో మున్వర్‌కు అందజేసేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో హనుమకొండ చింతగట్టు ఫ్లై ఓవర్ దిగుతుండగా వరంగల్ యాంటీ నార్కొటిక్స్ ఎస్సైలు శ్రీకాంత్, మొగిలి, సిబ్బంది పట్టుకున్నారు. సదయ్య, శేషును అరెస్ట్ చేసి గంజాయి, రెండు కార్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇద్దరు నిందితులపై ఇప్పటికే కేయూసీ, హసన్‌పర్తి పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఇదర్దు ఎస్సైలు, సిబ్బంది రంగయ్య, సోమలింగం, విజయ్, రాజేశ్, శ్రీను, రహీమ్, సంపత్, రాజు, సతీశ్‌ను డీఎస్పీ అభినందించారు.

కదం తొక్కిన కార్మిక లోకం

- ఊరూరా మే డే వేడుకలు
- ర్యాలీలు, జెండావిష్కరణలు
- పాల్గొన్న ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు
- కార్మికులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపు

కేసముద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ర్యాలీ తీస్తున్న కార్మికులు

నమస్తే నెట్‌వర్క్, మే 1: మే డే సందర్భంగా కార్మిక లోకం కదం తొక్కింది. ఊరూరా ర్యాలీలు తీసి జెండావిష్కరణలు చేసింది. బీఆర్ఎస్వీ, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని అరుణ పతాకాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా కార్మికులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి మే 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. హనుమకొండలోని లష్కర్ బజార్ వద్ద హమాలీలు, ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఎర్రజెండా ఎగురవేశారు.